క్లుప్తంగా

104 వాహనంలో అన్ని రకాల మందులు ఉండాలి



104 వాహనం కండీషన్ వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఎం కృష్ణ

మక్కువ: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు వైద్యసేవలందిస్తున్న 104వాహనాల్లో అన్ని రకాల మందులు నిల్వ ఉండేలా సిబ్బంది చూసుకోవాలని జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ తెలిపారు. మక్కువ, శంబర పీహెచ్‌సీల వద్ద ఉన్న 104 వాహనాలను జిల్లా మేనేజర్ కృష్ణ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలకు 104 ద్వారా వైద్య సేవలు అందించాలన్నారు. వాహనం కండీషన్ ఎప్పటికప్పుడు పరిశీలించి, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆయన సూచించారు.

జీఎస్టీ 2.0పై అవగాహన ర్యాలీ



పట్టణంలో నిర్వహిస్తున్న జీఎస్టీ అవగాహన ర్యాలీ

సాలూరు: జీఎస్టీ 2.0పై రవాణా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ, జీఎస్టీ 2.0 వలన పలు వాహనాలు, వస్తువుల రేట్లు తగ్గాయని తెలిపారు. వీటిపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

వసతిగృహంలో పరిసరాల పరిశుభ్రత



వసతిగృహం ప్రాంగణంలో పేరుకు పోయిన పచ్చికను తొలగిస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్...

సీతానగరం: మండలంలోని బూర్జ వసతిగృహం ప్రాంగణంలో పేరుకుపోయిన పచ్చికబయళ్లను వసతిగృహ సంక్షేమాధికారి దుర్గా ప్రసాద్ తొలగింపు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. సాక్షి దినపత్రికలో పచ్చిక బయళ్ళతో బూర్జ వసతిగృహం శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనంపై స్పందించారు. వసతిగృహ సంక్షేమ అధికారి గురువారం ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు పచ్చికబయళ్ల తొలగింపు పనులు చేయించారు. వసతిగృహంలో జరుగుతున్న పనులను ఎంఈవో–2 మువ్వల వెంకటరమణ పరిశీలించారు.

రహదారి లేక అవస్థలు



బురదతో గోతుల మయమైన రహదారి

మెంటాడ: మండలం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలానికి వెళ్లే రోడ్డు గోతులమయం కావడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గతంలో పంచాయతీలో నిధులు లేవని సర్పంచ్ తెలపడంతో లోతుగెడ్డ గ్రామ యువత రోడ్డు బాగు చేయాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణికి, కలెక్టర్‌కు పలుమార్లు మొరపెట్టుకున్నారు. అయినా రహదారికి నిధులు మంజూరు చేయలేదని యువత వాపోతున్నారు. కొంత మంది పెద్ద రైతులు ముందుకొచ్చి రూ40వేల వరకు సమకూర్చి కొన్ని గుంతలను పూడ్చారు.

డిజిటల్ రేషన్ కార్డులతో ప్రయోజనాలు

వీరఘట్టం: డిజిటల్ రేషన్ కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ అన్నారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో రేషన్ లబ్ధిదారులకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం గురువారం చేపట్టారు. రేషన్ డీలర్లు తమ వద్ద ఉన్న ఈ–పాస్ యంత్రాల్లో బయోమెట్రిక్ ద్వారా కార్డుదారుల వేలి ముద్రలు సేకరించి కార్డులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌వో ఎం.బాల సరస్వతి, తహసీల్దార్ కామేశ్వరరావు, సీఎస్‌డీటీ జి.ప్రసాదరావు, ఆర్.ఐ రవితేజ, కూటమి నాయకులు జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయ్, పాదిలాపు కృష్ణమూర్తి నాయుడు, బల్లా హరిబాబు పాల్గొన్నారు.

పొట్ట దశలో పంటల ధ్వంసం

పార్వతీపురం రూరల్:

విత్తనాల సమస్య తీరిందనగా, ఎరువుల సమస్య పట్టి పీడించి రైతులను అనేక అవస్థలకు గురి చేసింది. ఎరువుల కొనుగోలు, అదనపు భారం ఇలా రైతు నెత్తిపై తాండవం చేసిన అనేక కష్టాలను దిగమింగుకుంటూ తన పొలంలో ఉన్న పంటను కాపాడుకుంటూ వచ్చిన రైతులకు పార్వతీపురం మండలంలో ఏనుగుల సంచారంతో కళ్లెదుటే కడుపుకోత దుస్థితి నెలకొంది. పొట్ట దశలో ఉన్న వరిపైరును కాళ్లకింద ఏనుగులు తొక్కి పడేస్తుంటే అక్కడ రైతులు గుండె తరుక్కుపోతుంది. ఏనుగుల సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో యాత్రలు చేసి అధికారంలోకి రాగానే ఏనుగుల సమస్యపై నోరెత్తెడం లేదంటూ రైతులు ఒకింత బాధను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గత నెల నుంచి మండలంలోని పెదమరికి, చినమరికి, సంగంవలస, అడ్డూరువలస, హిందూపురం తాజాగా గురువారం చొక్కాపువానివలసలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు పంట పొలాల మీదుగా వెళ్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి.



చొక్కాపువానివలస సమీపంలో పొట్ట దశలో వున్న వరి చేనులో సంచరిస్తున్న ఏనుగుల గుంపు



ఏనుగులు ధ్వంసం చేస్తున్న వరి పంట

పొలాల్లో బీభత్సం.. గ్రామాల్లో భయం..

ఓ వైపు రైతుల ఆవేదన అరణ్య రోదనగా మారుతుంటే మరోవైపు అటవీశాఖ సిబ్బంది, ఎలిఫెంట్ ట్రాకర్స్ కంటి మీద కునుకు లేకుండా గస్తీ కాస్తున్నారు. ఏనుగుల గుంపు జనావాసాల వైపు రాకుండా వాటిని తిరిగి వ్యవసాయ పొలాల వైపు మళ్లించడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ వాటిని తరిమే ప్రయత్నం చేస్తున్నా అవి మళ్లీ మళ్లీ పంట పొలాలపై దాడి చేస్తూనే ఉన్నాయి. ఈ మేరకు ప్రజలను, రైతులను సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే ఉన్నారు.

హామీలు గాలికి..

అధికారంలోకి వచ్చిన వెంటనే ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. హామీలిచ్చిన నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారంటూ చేతికొచ్చిన పంట నాశనం అవుతుంటే కనీసం రైతును వచ్చి పరామర్శించే పాపాన పోలేదంటూ స్థానిక రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ ఆగ్రహాన్ని వెళ్లగక్కుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని, జరిగిన పంట నష్టాలకు ఎప్పటికప్పుడు పరిహారం చెల్లిస్తూ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

‘ఉల్లాస్’తో పెరగనున్న అక్షరాస్యులు



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

సీతానగరం: మండలంలోని నిరక్షరాస్యులైన వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ఆంధ్ర ముఖ్య ఉద్దేశమని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా వెలుగు, ఉపాధి హామీ పథకం అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఉల్లాస్ ఆంధ్ర కార్యక్రమం ముగింపు సదస్సు గురువారం జరిగింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యత నిర్మూలనకు నియమించిన వలంటీర్లు సహకారం తీసుకుని ఉపాధి హామీ వేతనదారులు, వెలుగు పొదుపు సంఘాల సభ్యులలో నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చి దిద్దడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమం వంద రోజుల్లో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో బాలకృష్ణ, వెలుగు ఏపీఎం భారతి, వలంటీర్లు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌కు విశేష స్పందన

వీరఘట్టం: సైన్స్ సెమినార్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన రావడం ఎంతో శుభ పరిణామం అని ఎంఈవోలు గౌరినాయుడు, ఆనందరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ సెమినార్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సెమినార్‌లో ఇచ్చిన «క్వాంటమ్ యొక్క కాలం... దాని శక్తి సామర్థ్యాలు» అనే అంశంపై విద్యార్థులు వివరించారు. మొత్తం 12 మంది విద్యార్థులు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కత్తులకవిటి హైస్కూల్‌కు చెందిన జి.చైతన్య ప్రథమ స్థానం, పి.వి.ఆర్ పురం యూపీ స్కూల్‌కు చెందిన పి.షర్మిల ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి ఎంఈవోలు, సైన్స్ ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.సాంబర, సి.హెచ్.రత్నాకరరావు, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సంపత్‌కుమార్, జి.లక్ష్మణరావు, జి.జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

బలిజిపేట: నేటి ప్రపంచం శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో ముందుకు నడుస్తుందని దీనికి అనుగుణంగా నూతన సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థులు అందుకోవాలని ఎంఈవో–1సామల సింహాచలం అన్నారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ సెమినార్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాంటం ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై విద్యార్థులు వారి ఆలోచనలను వివరించారు. సైన్స్‌కు సంబంధించిన పలు అంశాలకు చెందిన చార్ట్‌లను ప్రదర్శించారు. సెమినార్‌లో కేజీబీవీ వంతరాంకు చెందిన విద్యార్థిని ఎస్.సాయిచరణ్ ప్రథమ బహుమతి, చిలకలపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.సింధుజ ద్వితీయ, బలిజిపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి తృతీయ స్థానాలు సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఎంఈఓ–2 కె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటనాయుడు, రాజాగణేష్, బీవీ రమణ, నారాయణస్వామి, బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



108 అంబులెన్స్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ప్రోగ్రాం మేనేజర్

పార్వతీపురం: ఆపదలో వున్న వారికి మెరుగైన సేవలను అందించి ప్రాణాలను కాపాడాలని రాష్ట్ర 108 ప్రోగ్రాం మేనేజర్ మహమ్మద్ గౌస్ బాషా సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో వున్న 108 అంబులెన్స్ రికార్డులను, మందులను, పరికరాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో వున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఆపదలో వున్న వారిని కాపాడాలన్నారు. 24 గంటలు అందుబాటులో ఉంటూ తమ అమూల్యమైన సేవలను అందించాలన్నారు. సేవలను అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయన్నారు. జిల్లా మేనేజర్ మన్మథ నాయుడు, డివిజనల్ అధికారి గిరిబాబు తదితరులున్నారు.

ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన ఏటీడబ్ల్యూవో



మామిడిపల్లి పీహెచ్‌సీలో చిన్నారులను పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి

సాలూరు రూరల్: మండలంలోని తోణాం, మామిడిపల్లి, మావుడి గిరిజన ఆశ్రమ పాఠశాలలతో పాటు తోణాం, మామిడిపల్లి పీహెచ్‌సీలను ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అలాగే డీఈవో రాజ్‌కుమార్ బొడ్డవలస హాస్టల్‌తో పాటు మామిడిపల్లి పీహెచ్‌సీ, మామిడిపల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

మొక్కజొన్న రైతుకు దిక్కెవరు!

- పెట్టుబడులు కూడా రాని దుస్థితి
- ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దళారులదే రాజ్యం



తడిచిన మొక్కజొన్నలు ఆరపెడుతున్న రైతులు

సాలూరు రూరల్: మండలంలోని మొక్కజొన్న రైతులు ఆందోళ చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా వరకు మొక్కజొన్నలు తడిచి రంగు మారడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎంత ఎండబెట్టిన వాటి పరిస్థితి మారకపోవడంతో ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేస్తారని ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే ఇంతవరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. దీనితో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకే జొన్నలు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధర క్వింటా రూ.2400 కాగా దళారులు మాత్రం రూ.1800 నుంచి రూ.1950 ధరకు కొనుగోలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. రంగు మారిన మొక్కజొన్నలు రూ.1300 కే దళారులు అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవడం లేదని వాపోతున్నారు. మండలంలో 4500 ఎకరాల్లో మొక్కజొన్నలు పండించగా ఇప్పటికే 50 శాతం రైతులు మొక్కజొన్న ఆరపెట్టి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందే తప్ప కొనుగోలు మాత్రం చేయడం లేదని దీనితో దళారులు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి తప్పడం లేదని వాపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తడిచిన మొక్కజొన్నతో నష్టం

పదెకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట వేశాను. ఇటీవల కురిసిన వర్షాలకు జొన్నలు తడిసిపోయాయి. దీంతో రంగు మారాయి. తడిసిన మొక్కజొన్నలు దళారులు తమ ఇష్టం వచ్చిన ధరకు కొంటున్నారు. దీంతో చేసిన అప్పులు కూడా తీరేటట్టు లేదు. ఎండలో ఆరబెట్టి నిల్వ ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాను.

– లావేటి ప్రియాంక, రైతు, కందుల పథం



గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు చెల్లించాలి



ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

బలిజిపేట: తమకు బకాయి వేతనాలు చెల్లించి, మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ బలిజిపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడార్ల సంఘం మండల కార్యదర్శి పృథ్వి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి జీతాలు చెల్లించకుండా ప్రభుత్వం వారిపై కక్ష సాధింపు చర్యలు చేపడుతుందన్నారు.

ఇలా అయితే తమ కుటుంబాలను ఏ విధంగా పోషించుకోగలమని వారు ప్రశ్నిస్తున్నారు. గ్లౌజులు, సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ అలవెన్స్ రూ.4వేలు అమలు చేయలేదన్నారు. రిక్షాల మరమ్మతులు సొంత నిధులతో చేయించుకుంటున్నామన్నారు. కార్యదర్శులు మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదన్నారు. అనంతరం ఎంపీడీవో శ్రీవాణికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మన్మథరావు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న బీఎస్ఎన్ఎల్ టవర్స్



పిచ్చి మొక్కల మధ్య బూర్జ బస్‌స్టాప్ వద్ద ఉన్న బీఎస్ఎన్ఎల్ టవరు

సీతానగరం: మండలంలోని బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లు పని చేయకపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌పై 1450 మంది వినియోగదారులు ఉన్నారు. మొబైల్ ఫోన్‌లు, ల్యాండ్ ఫోన్‌లు నిర్విఘ్నంగా పని చేయడానికి నిడగల్లు, బగ్గందొరవలస, బూర్జ, సీతానగరం కేంద్రాలుగా టవర్లు నిర్మించారు. వాటి పర్యవేక్షణకు ఉద్యోగులు, సిబ్బంది కొరవడడంతో టవర్ల చుట్టూ పిచ్చి మొక్కలున్నందున ఎలుకలు స్వైర్య విహారం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బీఎస్ఎన్ఎల్ టవర్లు పనిచేయకపోవడంతో దూర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడలేకపోతున్నామని వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ శాఖ అధికారులు స్పందించి వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఆర్‌బీఎస్‌కే జిల్లా అధికారి జగన్‌మోహనరావు



సిక్ రూంలో ఉన్న విద్యార్థితో మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా అధికారి డా. జగన్‌మోహనరావు

పార్వతీపురం రూరల్: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్‌బీఎస్‌కే జిల్లా అధికారి డా. టి.జగన్‌మోహనరావు స్పష్టం చేశారు. పార్వతీపురం మండలంలోని రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించి సిక్‌రూం, రికార్డులను పరిశీలించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ వారం తప్పనిసరిగా హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించాలని, పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేసి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం..



సాలూరు: కోటి సంతకాల సేకరణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పార్టీ శ్రేణులు

- నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు
- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కరపత్రాల ఆవిష్కరణ

సాలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ద్వారా పేదలకు ప్రభుత్వ వైద్య సేవలు దూరం కాబోతున్నాయని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన పెంపొందించి చైతన్యపరచాలని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమ కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి గురువారం తన గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలు తీసుకురాగా, నాలుగుసార్లు సీఎంగా చేసిన చంద్రబాబు ఒక్క మెడికల్ కళాశాలను తీసుకురాలేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం తెచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నేడు కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులు వేస్తూ పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని దూరం చేసే కుట్ర చేస్తుందన్నారు. ఇప్పటికే గత నెల రోజులుగా రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయన్నారు. దీంతో పేదల ప్రాణాలకు భరోసా లేకుండా పోయిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో వైద్యం అందరికీ అందుబాటులో ఉండేదని, నేడు కూటమి పాలనలో వైద్యం దయనీయంగా మారిందన్నారు. వైద్య రంగాన్ని కూటమి ప్రభుత్వం నీరుగార్చేందుకు చూస్తుందన్నారు. కూటమి పాలనలో రైతులకు యూరియా అందలేదని, ఆరోగ్యశ్రీ లేక ప్రజలు అల్లాడిపోతున్నారని, నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని ధ్వజమెత్తారు. రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని అన్నారు. పార్టీ శ్రేణులంతా సమష్టిగా పని చేయాలని దిశ నిర్దేశం చేశారు. పార్టీ కమిటీలు, రచ్చబండ తదితర కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, పార్టీ ఫ్లోర్ లీడర్ గొర్లె జగన్‌మోహన్‌రావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలపై ‘కూటమి’ కుట్రలు..: అలజంగి



సీతానగరం: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ ప్రజలు కోటి సంతకాల సేకరణలో భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపు నిచ్చారు. మండలంలోని కాశీపేట, అంటిపేట పంచాయతీల్లో గురువారం ప్రభుత్వ మెడికల్ కాలేజీలప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ రచ్చబండ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఉచిత వైద్య సేవలందించడానికి, పేద కుటుంబాల్లో డాక్టర్లుగా చదివించడానికి వీలుగా జగనన్న ప్రభుత్వం మొదటి విడతగా రూ.600 కోట్లతో మెడికల్ కాలేజీలు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే 5 మెడికల్ కాలేజీలలో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారన్నారు. మిగతా కాలేజీలు పూర్తి చేసే లోగా కూటమి ప్రభుత్వం రావడంతో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. ఈ నేపథ్యంలో పార్వతీపురం నడిబొడ్డున నిర్మాణం చేపట్టిన మెడికల్ కాలేజీ నిర్మాణం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అర్థాంతరంగా నిలిపివేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, పార్టీ సీనియర్ నాయకులు వి.దానబాబు, డాక్టర్ అంబటి కృష్ణంనాయుడు, పోల ఈశ్వరనారాయణ, బి.శంకరరావు, మన్మధరావు, సర్పంచ్‌లు టి.ధనంజయమ్మ, అల్లు తిరుపతిరావు, బి.తిరుపతిరావు, బి.ధనంజయ్, టి.శ్రీనివాసరావు, బొంగు తిరుపతిరావు, మాజీ వీఆర్వో ప్రభాకర్, ఎంపీటీసీలు శ్రీనివాసరావు, ఎస్.నిర్మల, ఎస్.తిరుపతిరావు, అప్పలనాయుడు, వై.గోపాలనాయుడు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి



రైతుల సమస్యలు వివరిస్తున్న నాయకులు

పాలకొండ రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్ష ప్రభావంతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కిమిడి రామ్మూర్తినాయుడు అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పరిధిలో కురుపాం, సాలూరు, పాలకొండ, నియోజకవర్గాలతో పాటు వీరఘట్టం, భామిని మండలాలకు చెందిన రైతులు సమస్యలు ప్రస్తావించారు. అధిక శాతం పత్తి, మొక్కజొన్న, అరటి తదితర వాణిజ్య పంటలతో పాటు కీలక దశలో వరి పంటకు ఏర్పడ్డ ఇబ్బందులతో రైతులు తీవ్రంగా ఆర్థిక నష్టం చవిచూశారన్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో నాగావళి, వంశధార నదీ తీరాల వెంబడి పంట భూములు నీట మునిగి నష్టపోయిన కర్షకుల కష్టం గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన బుడితి అప్పలనాయుడు, గురబిల్లి అప్పలనాయుడు, పారినాయుడు పాల్గొన్నారు.